# అతకని బ్రతుకులు

"ప్రమద"

నూకాలు మళ్ళీ ఒక సారి గట్టిగా ముద్దుపెట్టుకుంది. కుక్కి మంచంలోని పిల్లవాడు "ఉ" అని మూలిగి వత్తిగిల్లి పడుకున్నాడు. "నా బాబే, నా బంగారే, నిద్రపో నాయనా" అంది. ఎదురుగ నున్న పొగ చూరిన గోడలు తనను వెక్కిరిస్తున్నాయి. ఇంకా తన భర్త ఫ్యాక్టరి నుంచి రాలేదు. నూకాలు అక్కడ అక్కడ ఇళ్ళల్లో పనిచేస్తుంది. నెల తిరిగేసరికి ఓ పది రూకలు తెస్తుంది. తన భర్త ఫ్యాక్టరీలో కూలికెళ్తాడు. దొరికిన రోజు దొరుకుతుంది. దొరకనిరోజు లేదు. పగలంతా పనిచేసి రాత్రయ్యేసరికి ఇంటికి ఓ రూపాయి బియ్యం పట్టుకుని వస్తాడు. నూకాలుకి ఒక కొడుకు. వాడికి అయిదేళ్ళు. రాత్రి ఎనిమిది అయింది. "అబ్బ ఇంత బరువేమొ - ఈ వెధవ బస్తా" అంటూ ఒక బియ్యపు మూట గుడిసెలో పడేసేడు వెంకాయి.

నూకాలు ఉలిక్కిపడి లేచింది. భర్తకు అన్నము పెట్టి వచ్చి నరిసిగాడి పక్కలో పడుకుంది. వెంకాయిగాడు అక్కడే చాపవేసి పడుకున్నాడు.

"ఎట్లా మామా! ఈ పురుడెట్టా వెళ్తుంది? నాకేటో భయంగా ఉంది." అంది నూకాలు.

"భయం ఎందుకే, ఆ భగవంతుడు లేడు? నారు పోసిన వాడు నీరు పొయ్యడే" అన్నాడు.

"ఆ ఏటో మామా. నాకేమి ధైర్యములేదు."

"ఎందుకే అంత భయం. నువ్వసలు దిగులుపడకు."

"నీకుందిగాని నాకులేదు ధైర్యము మామా. కనీసం ఓ వంద రూపాయలన్నా కావాలిగదా!"

కాని వెంకాయ్ అప్పటికే నిద్రాదేవి వడిలో తల దాచుకున్నాడు. భర్త ముఖము చూసేటప్పటికి నూకాలుకి జాలేసింది. "ఏటో పాపం. పగలంతా పని చేత్తాడు. ఇట్టా ఒళ్ళెరక్క నిద్రపోతాడు." అనుకుంది. గుడిసెలోని చిన్న దీపం మిణుకు మిణుకు మంటున్నది. దాన్ని చూస్తూనే నిద్రపోయింది.

నూకాలుకి, తొమ్మిదో నెల. ఇంక తను "పని మానేద్దాం, అమ్మగారికి చెప్పొద్దాం" అనుకుంది నూకాలు. ఈ కాస్త తతంగం ఎలాగో ఒకలా వెళ్ళిపోతే తరువాత మళ్ళీ పని చేద్దాం." అనుకుంది మళ్ళీ నెమ్మదిగా లేచి బయలు దేరింది. కాళ్లు బళ్ళు తప్పించుకుని "అమ్మ, అమ్మా" అని పిలిచింది, ఓ లావుపాటి ఆపిడ వచ్చి తలుపు తీసింది. నూకాలు సంగతంతా చెప్పింది. "సరేలేవే, ఓ పది రూపాయలైతే ఎట్టాగో అట్టానే చూస్తాలే. ఈ పూటకి ఆ గిన్నెలు తోమిపో!" అంది ఇంటావిడ.

"సరె, చింతపండెయ్యండి." అని దొడ్లోకి దారి తీసింది నూకాలు. గిన్నెలమధ్యలో మిల మిల మెరుస్తున్నది వెండిగిన్నె. "దీంతో మనకి ఈ తతంగం వెళ్ళిపోతుంది." అనుకుంది మనసులో. దాన్ని చూస్తుంటే నూకాలుకి రకరకాల ఆలోచనలు పోసాగినయి. "వెళ్తున్నానమ్మా." అంటూ వచ్చేసింది. ఆ గిన్నెల్లో ఒకగిన్నె తక్కువైందని ఇంటి యజమానురాలు గుర్తించలేదు పాపం.

"అమ్మేయి, మామా! ఈ వెండిగిన్నె ఓ వంద వస్తయి. ఆయింటావిడ కనుక్కోలేదులే. అమ్మెయి" అంది.

"ఒసేయి! ఎందుకే ఆ వెధవ పనులు, మనకేం తక్కువ." అన్నాడు. వెంకాయ్.

"నీకు తెలీదు మామా. అమ్మ." అంది.

వెంకాయ్ చివరకి వప్పుకున్నాడు. తెల్లవారు ఝామున ఆరుగంటలకి నరిసిగాడ్ని తనతో లేపేడు. "నాతో రారా" "సరెనయ్యా" అంటూ నరిసిగాడు వెంకాయ్‌ని వెంబడించాడు.

వంద జేబులోపెట్టి "జాగ్రత్తగ తీసికెళ్ళి అమ్మకియ్యి బాబు" అన్నాడు. "సరెనయ్యా." అంటూ అభం శుభం తెలియని ఆ పసికందు బళ్ళు, కార్లు తప్పించుకొని వస్తున్నాడు. ఆ వంద రూపాయలమీద ఎందరిదో కన్ను బడ్డది. "పిప్పరమెంట్లు పెడ్తారా" అన్నాడు ఒకడు. నరిసిగాడు నిజమేననుకుని వాడి వెంబడి వెళ్ళాడు. ఆ వంద వాడిజేబులోకి వెళ్ళింది. నాలుగు పిప్పరమెంట్లు ఇచ్చి "పో" అన్నాడు. నరిసిగాడికిదేమీ తెలియదు. తియ్యని పిప్పరమెంట్లు తింటూ బజారువెంబడి వస్తున్నాడు. "బయ్" మంటు ఒక కారు వచ్చి నరిసిగాడ్ని ఈ లోకం సంబంధం తెంచి వెళ్ళిపోయింది.

నూకాలును వచ్చి పోలీసులు దండించారు. వాళ్ళు పెట్టే బాధలకు తాళలేక నిజం ఒప్పేసుకుంది. పోలీసుల మధ్యన నూకాలు జైలుకు పోతున్నది. నరిసిగాడు ఈ లోకం చూడనని పరలోకానికి వెళ్ళాడు. ఏమీ తెలియని వెంకాయ్ తనపని తాను చేసుకుంటున్నాడు.—